సాక్షి
జనగామ
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



పందిరిసాగు బహుబాగు

పందిరి కూరగాయల తోటల ద్వారా అధిక దిగుబడితో పాటు అధిక ఆదాయం ఆర్జించ వచ్చని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు తెలిపారు. - 10లో▸



అసోసియేషన్లను ఎందుకు పిలువలేదు?

సమీక్ష సమావేశానికి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులను ఎందుకు పిలువలేదని కమిషన్ చైర్మన్ వెంకటయ్య ప్రశ్నించారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హామీ నిలబెట్టుకున్నాం..



జనగామ: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ హామీని నిలబెట్టుకుని, తన చిత్త శుద్ధిని నిరూపించుకుంటోందని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పీవీ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం కొమ్మూరి విలేకరులతో మాట్లాడారు.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, గవర్నర్‌కు పంపడం జరిగిందన్నారు. బీసీలకు ఘోరమైన అవమానం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి నిగ్గుతేల్చేందుకు సీబీఐకి అప్పగించడం స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో లింగాల నర్సిరెడ్డి, వంగాల మల్లారెడ్డి, ఆలేటి సిద్ధిరాములు, చెంచారపు బుచ్చిరెడ్డి, వంగాల కళ్యాణి, ఇందిర, కరుణాకర్‌రెడ్డి, గాదెపాక రాంచందర్, అల్వాల ఎల్లయ్య, మల్లేశం, బక్క శ్రీని వాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా జీవిత బీమా



జనగామ: అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా అండగా జీవిత బీమా సేవలు కొనసాగుతున్నాయని జీవిత బీమా(ఎల్‌ఐసీ) బ్రాంచి సీనియర్ మేనేజర్ హరిలాల్ అన్నారు. సోమవారం పట్టణంలో భారతీయ జీవిత బీమా సంస్థ జనగామ శాఖ ఆధ్వర్యంలో 69 ఆవిర్భావ దినోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు..30 కోట్ల మంది పాలసీదారులను కలిగి అత్యుత్తమమైన సేవలతో జీవిత బీమా సంస్థ అగ్రగామిగా ఉందన్నారు. జనగామ శాఖ పరిధిలో స్టేషన్ ఘన్‌పూర్‌లో శాటిలైట్ ఆఫీస్ ఉందని, త్వరలో పాలకుర్తిలో మైక్రో లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫీస్ ఓపెన్ చేయడానికి సిఫార్సు చేశామన్నారు. కార్యక్రమంలో జనగామ ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ రాజేశ్, బ్యాంక్ మేనేజర్లు, అధికారులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవం పోటీలకు ఎంపిక



జనగామ రూరల్: రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీలకు తెలంగాణ మోడల్ స్కూల్ చౌడారం విద్యార్థిని నాంపల్లి అక్షయ ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ కె.సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలో జరిగిన జిల్లాస్థాయి కళాఉత్సవ పోటీల్లో సోలో క్లాసికల్ డ్యాన్స్‌లో పదో తరగతి విద్యార్థిని అక్షయ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.


భాగవతాన్ని అధ్యయనం చేయాలి

- సాహితీవేత్త శంకరమంచి శ్యాంప్రసాద్



పాలకుర్తి టౌన్: విద్యార్థులు సాంకేతికంగానే కాకుండా సామాజిక విలువల్ని పెంపొందించుకోవటానికి భాగవత పద్యాలను నేర్చుకోవాలని సాహితీవేత్త శంకరమంచి శ్యాం ప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని బమ్మెర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో శంకరమంచి మాట్లాడుతూ.. భక్తితో పాటు సామాజిక విలువల్ని మానవీయ మూలాలను ప్రబోధించిన పోతన భాగవతాన్ని విద్యార్థుల అధ్యయనం చేయాలన్నారు. పోతన పద్యాలను నేర్చుకున్న విద్యార్థులకు పురస్కారాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో చరిత్ర పరిశోధకులు కేవీజీకే ఆచార్యులు శంకరమంచి శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి సీటీ స్కాన్ సేవలు



ఆస్పత్రిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సీటీ స్కాన్ యంత్రం

- జిల్లా ఆస్పత్రిలో ప్రారంభించనున్న వైద్యారోగ్యశాఖ మంత్రి
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- 9 ఏళ్ల తర్వాత మోక్షం

జనగామ: జిల్లా ప్రజలు తొమ్మిదేళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరబోతోంది. జిల్లా జనరల్ ఆస్పత్రిలో నేటి(మంగళవారం) నుంచి సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు మూలనపడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను సాక్షి వరుస కథనాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెంటనే స్పందించి సీటీ స్కాన్ యంత్రం కొను గోలుకు చర్యలు చేపట్టారు. మంత్రి ఆదేశాలతో డీఎంఈ



ఆస్పత్రిలో ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్

సీటీ స్కాన్ యంత్రం కొనుగోలుకు సంబంధిత కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని, అందుకు సంబంధించిన డబ్బులు సైతం చెల్లించారు. డబ్బులు చెల్లించిన రెండు నెలల తర్వాత మిషన్ ఇక్కడకు చేరుకుంది. గతంలో ఉన్న సీటీ స్కాన్ గదిలోనే కొత్త స్కానింగ్ యంత్రాన్ని అమర్చారు. మిషన్ సేవలకు సిద్ధమైనప్పటికీ, సాంకేతిక కారణాలతో సేవలను ప్రారంభించేందుకు ఆలస్యం జరిగింది. సాక్షి కృషితో సీటీ స్కాన్ సేవలు ప్రారంభం కాబో తున్న వేళ ప్రజలు ప్రభుత్వంతో పాటు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నిరుపేదలకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉచితంగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలెక్టర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగంను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ గోపీరామ్ తదితరులు ఉన్నారు.



పేరుకే పెద్దాస్పత్రి

సాక్షిలో వచ్చిన కథనం(ఫైల్)

మంత్రి రాక..

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలను ప్రారంభించేందుకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ మంగళవారం జిల్లా కేంద్రానికి రానున్నారు. తిరుమలగిరి, మరిపెడ, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో పర్యటన ముగించుకుని సాయంత్రం 4.30 గంటలకు చేరుకుంటారు. సీటీ స్కాన్ సేవలు ప్రారంభించిన తర్వాత, రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

పరిష్కారానికి ఇంకెన్నాళ్లు?

- ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- గ్రీవెన్స్‌లో దరఖాస్తులు చేస్తున్నా పట్టింపులేదు..
- ప్రజావాణిలో బాధితుల గోడు
- వినతులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తదితరులు

జనగామ రూరల్: తమకు అన్యాయం జరిగినా నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడం లేదని ఓ బాధితురాలు..కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉందని అంత్యోదయ కార్డు ఇచ్చి ఆదుకోవాలని ఓ పేదమహిళ.. రెండో విడత ఇందిరమ్మ బిల్లు రావడం లేదని ఓ లబ్ధిదారు, ఆరు నెలల నుంచి వేతనాలు లేక అవస్థలు పడుతున్నామని ఓ చిరుద్యోగి...ఇలా పలు సమస్యలతో సోమవారం ప్రజలు గ్రీవెన్స్‌సెల్‌కు తరలివచ్చారు. ఈసందర్భంగా ప్రజల నుంచి 69 వినతులను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్షాలోమ్, జిల్లా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల్లో ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్లు, భూ సమస్యలు అధికంగా ఉన్నాయి. దూరప్రాంతాల నుంచి ఖర్చులు పెట్టుకుని ఏళ్లతరబడి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు వాపోయారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆయా శాఖల అధికారులు నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గోపిరామ్, డీఎస్ వెంకన్న, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు కొన్ని ఇలా..

- నర్మెట మండల కేంద్రానికి చెందిన దేవర ధ్రువిత్‌రెడ్డి తన దరఖాస్తు అందిస్తూ తన తల్లి చనిపోయిందని, తండ్రి పట్టించుకోవడం లేదని తనకు చదువుకునేందుకు సోషల్ వెల్ఫేర్ గురుకులం లో సీటు ఇప్పించగలరని వినతిపత్రం అందజేశాడు.
- రఘునాథపల్లి మండలం కన్నాయిపల్లి గ్రామానికి చెందిన యాదగిరి కుమార్తె జస్విక.. తాను ఆత్మకూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నానని పాలకుర్తిలో గాని, నర్మెటలో గాని గురుకులంలో సీటు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేసింది.
- జనగామ పట్టణానికి చెందిన సంఘ వెంకటేశ్ తన దరఖాస్తు అందిస్తూ తన ఇంటి చుట్టూ నీరు నిలుస్తున్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సమస్యను పరిష్కరించాల్సిందిగా దరఖాస్తు అందించారు.
- తరిగొప్పుల మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన పుష్ప..తన భర్త కృష్ణయ్య మరణించాడని నలుగురు కుమార్తెలతో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, కూలి పనులపై ఆధారపడి జీవిస్తున్నందున తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది.

పట్టా కావడం లేదు



గ్రామంలో సర్వే నెంబర్ 191లో ఎకరం 36 గుంటల భూమి నా పేరిట ఉంది. గత ప్రభుత్వంలో పట్టాపాస్ బుక్ కోసం దరఖాస్తు చేసుకున్నా. అధికారులు ఇప్పటి వరకు పట్టా పాస్ బుక్ ఇవ్వడం లేదు. భూభారతిలో దరఖాస్తు చేసుకున్న ఎలాంటి సమాధానం లేదు. సర్వే చేపట్టి పట్టా పాస్ బుక్ మంజూరు చేయాలి.

-బొట్ల బాబు, యశ్వంతాపూర్, జనగామ మండలం

అంత్యోదయ కార్డు ఇచ్చి ఆదుకోవాలి



నాపేరు ఖమ్మం శ్రీకాంత్. మాది స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామం. పుట్టుకతోనే నాకు కళ్లు కనబడవు. వివాహమై 5 ఏళ్లు అవుతోంది. పింఛన్‌తో, భార్య కూలీ పనులతో కాలం వెల్లదీస్తున్నాం. తల్లిదండ్రుల రేషన్‌కార్డులో పేరు ఉంది. దివ్యాంగుడి కోటా కింద నాకు అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని, 5 ఏళ్ల నుంచి తిరుగుతున్నా. నాకు కొత్త కార్డు మంజూరు చేయండి.

ఆరు నెలలుగా వేతనాలు లేవు

తెలంగాణ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, పీడీ, కంప్యూటర్ ఆపరేటర్స్, నైట్ వాచ్‌మెన్, అటెండర్లకు ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో జీవనోపాధి కష్టంగా మారింది. ప్రభుత్వం వెంటనే మాకు రావాల్సిన వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలి.



నిందితులపై కేసుపెట్టడం లేదు



గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు 2019లో తనను అకారణంగా కొట్టి కులం పేరుతో దూషించారు. అప్పటినుంచి న్యాయం జరగాలని, ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని పోలీసులను కోరినా పట్టించుకోవడం లేదు. తనకు తల్లిదండ్రులు, తోబుట్టువు ఎవరూ లేరు. ఎక్కడికి వెళ్లిన న్యాయం జరగడం లేదు.

- కోసంగి ఉపేంద్ర, రామరాజుపల్లి, దేవరుప్పల మండలం

రెండో విడత బిల్లుకు ఇబ్బందులు



ఇందిరమ్మ ఇల్లు పనులు ప్రారంభించినప్పుడు మొదటి విడత బిల్లు వచ్చింది. అయితే సజ్జల లెవల్‌కు రాగా రెండో విడత బిల్లుకు ఫొటో అప్‌లోడ్ కావడం లేదని అధికారులను అడగగా ఉప్పల్‌లో ఇల్లు ఉందని అందుకే బిల్లు రావడం లేదని అంటున్నారు. తమకు ఎక్కడ ఇల్లు లేదని హైదరాబాద్‌కు, కలెక్టరేట్‌కు అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఇల్లు లే కున్నా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోందని, విచారణ చేపట్టి తమకు ఇందిరమ్మ బిల్లు వచ్చేలా చూడాలి.

-కోసున రాంచంద్రరెడ్డి, గోపాలపురం, పాలకుర్తి మండలం

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి



గ్రామంలో ఎలాంటి ఆస్తులు లేవు. ఇద్దరు పిల్లల భవిష్యత్ కోసం హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటు బతుకుతున్నాం. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినా ఇంతవరకు అనుమతి పత్రాలు ఇవ్వడం లేదు.

- మిద్దేపాక సునీత, పసరమడ్ల, జనగామ మండలం

వరద నష్టనివారణ చర్యలు చేపట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు, అధికారులు

జనగామ రూరల్: వరద నష్టనివారణ చర్యలు చేపట్టాలని, శాఖల పరంగా పనులు గుర్తించి నివేదికలు రూపొందించుకోవాలని, పనులు, కావాల్సిన నిధులను తెలియజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూయ(సీతక్క) తదితర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్లు బెన్షా లోమ్, పింకేశ్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..జిల్లాలో భారీ వర్షాల వల్ల కలిగిన నష్టంపై అంచనాలు రూపొందించి తక్షణమే నివేదికలు అందజేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జిల్లా అధికారులు, నీటిపారుదల, ఇంజనీరింగ్, వైద్య, విద్యుత్, వ్యవసాయ, ఉద్యాన వన, పంచాయతీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వేయర్లకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా శిక్షణ పూర్తిచేసుకున్న 48 మంది సర్వేయర్లకు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సర్వేయర్‌గా శిక్షణ పొంది అర్హత సాధించిన సర్వేయర్లకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఏఓ శ్రీకాంత్, సర్వే శాఖ ఏడీ మన్యం కొండ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే..



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ సర్కార్ నెరవేర్చాలి
- టీఎన్జీవో, జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్

జనగామ: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని టీఎన్జీవో, జేఏసీ అధ్యక్షుడు ఖాజా షరీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరట్ ఆవరణలో రెండు గంటల పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఖాజా షరీఫ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) పునరుద్ధరించేందుకు మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక్కసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలకు జీవితాంతం పెన్షన్ లభిస్తోందని, 35 సంవత్సరాలు ప్రజాసేవ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి పెన్షన్ ఇవ్వకపోవడం ఎంత అన్యాయమో ఆలోచించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని, లేని పక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కొర్నేలియస్, పి.చంద్రశేఖర్‌రావు, షరీఫ్, లక్ష్మీనారాయణ, పెండెల శ్రీనివాస్, పేర్వారం ప్రభాకర్, హఫీజ్, రాజనర్సయ్య, సంపత్ కుమార్, రాంనరసయ్య, మదూరి వెంకటేశ్, ఉప్పలయ్య, స్టెల్లా, శ్రీధర్‌బాబు, నాగార్జున, విష్ణు, అరుణ, బాబు, మధు శంకర్, రాజు, చందర్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

- కలెక్టరేట్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న చింతల రాంచంద్రారెడ్డి

జనగామ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, అలాగే ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలపై విచారణ చేపట్టి అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వరికి రూ.500 బోనస్ అని బోగస్ చేశారని, తక్షణమే నిధులు విడుదల చేయాలన్నారు. వర్షాలు, వరదల నష్టాలపై అసెంబ్లీలో మాట్లాడలేదని.. రాజకీయ పబ్బం కోసమే అర్ధరాత్రి వరకు నిర్వహించారని విమర్శించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో మహిళా కానిస్టేబుల్ చేతికి స్వల్పగాయమైంది. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్ఎన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు శివరాజ్‌యాదవ్, దుబ్బ రాజశేఖర్, పార్లమెంట్ కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్, ఉడుగుల రమేశ్, లేగ రామ్‌మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, ఉమారాణి, పట్టణ అధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

బనకచర్లను బాబుకు కట్టబెట్టేందుకే!

- సీఎం రేవంత్‌రెడ్డి బూటకపు మాటలతో సీబీఐ తెరపైకి
- జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ రాస్తారోకో, ర్యాలీ
- సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం



జనగామ: వరంగల్ హైవేపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జనగామ: బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ముఖ్యమంత్రి బాబుకు కట్టబెట్టేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయనే బూటకపు మాటలతో సీఎం రేవంత్‌రెడ్డి సీబీఐని తెరపైకి తీసుకొచ్చాడని ఏఎంసీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మాజీ ఎంపీపీ మేకల కలింగరాజు ఆరోపించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి అధ్యక్షతన కాళేశ్వరంపై సీబీఐని వ్యతిరేకిస్తూ, రైతులకు యూరియా అందించాలని కోరుతూ సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా ఆర్టీసీ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. వరంగల్–హైదరాబాద్ ప్రధాన హైవే జంక్షన్‌లో బైఠాయించి రాస్తారోకో చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు శ్రేణులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అంతకుముందు యూరియా కోసం రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో సీబీఐపై రాహుల్‌గాంధీ మండిపడుతుంటే, ఇక్కడ మాత్రం రేవంత్‌కు ప్రేమ పెరిగిందన్నారు. రేవంత్, చంద్రబాబు, ప్రధాని మోదీ కుట్రలను ప్రజలు ఖండించి, గోదావరి జలాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్‌ను ముట్టుకుంటే తెలంగాణ సమాజం భగ్గుమంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పోకల జమున లింగయ్య, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, ముస్త్యాల దయాకర్, గుర్రం భూలక్ష్మీనాగరాజు, ఉల్లెంగుల సందీప్, జూకంటి లక్ష్మిశ్రీశైలం, సేవెల్లి మధు, ఉడుగుల కిష్టయ్య, అనిత, శారత, రేఖ, ఉడుగుల నర్సింహులు, మామిడాల రాజు, సువార్త, రాజు, జాయ శ్రీశైలం, యాకూబ్ తదితరులు ఉన్నారు.

యూరియా పంపిణీపై పకడ్బందీ పర్యవేక్షణ

జనగామ రూరల్: యూరియా పంపిణీపై అధికారులు ప్రతిరోజు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలో యూరియా పంపిణీపై నిరంతరం పర్యవేక్షణలు ఉండాలని వ్యవసాయ అధికారులను, తహసీల్దార్లకు సూచించారు. నిరంతరంగా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతను పాటించాలన్నారు. వైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సీటీ స్కాన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు బెన్షాలోమ్, పింకేశ్ కుమార్, ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వెల్ది యువకుడి ప్రతిభ

రఘునాథపల్లి: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన కట్లెం నవీన్ లాంగ్ జంప్‌లో ప్రతిభ చాటి ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన నవీన్‌ను సోమవారం గ్రామ పంచాయతీ వద్ద గ్రామపెద్దలు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొయ్యడ మల్లేశ్, పెండ్లి మల్లారెడ్డి, సింగిరెడ్డి తిరుమల్‌రెడ్డి, పెండ్లి సోమిరెడ్డి, కొయ్యడ యాదగిరి, మోహన్‌రెడ్డి, సోమయ్య, రాజ్‌కుమార్, నర్సయ్య, అశోక్, శ్రీనివాస్, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవీన్‌ను సత్కరిస్తున్న గ్రామపెద్దలు

క్లుప్తంగా

నేచురోపతి లైబ్రరీ రీసెర్చ్ సెంటర్, కేయూ మధ్య ఎంఓయూ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ, హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలోని ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం ఇంటర్నేషనల్ నేచురోపతి లైబ్రరీ రీసెర్చ్ సెంటర్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ మేరకు సోమవారం క్యాంపస్‌లోని అకడమిక్ కమిటీ హాల్‌లో వీసీ కె. ప్రతాప్‌రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ వి. రామచంద్రం, ఆ రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకుడు గజ్జెల రామేశ్వరం అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భగా రిజిస్ట్రార్ వి. రామచంద్రం మాట్లాడుతూ నేచురోపతి లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న దేశంలోని తొలి యూనివర్సిటీ కేయూ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా కేయూలోని లైబ్రరీ సైన్స్, ఆర్ట్స్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, యోగా, సోషల్ సైన్స్ వంటి విభాగాల్లో పరిశోధనలకు ఈ రీసెర్చ్ సెంటర్‌తో విస్తృత అవకాశాలు కలుగుతాయని తెలిపారు. సైన్స్ విభాగాల డీన్ జి. హనుమంతు, పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, ప్రిన్సిపాల్ టి. మనోహర్, ఫార్మసీ కళాశాల డీన్ గాదె సమ్మయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ఫార్మా 'డీ' ఫస్టియర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఫార్మా 'డీ' ఫస్టియర్ రెగ్యులర్, ఎక్స్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు ఈనెల 8వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ సోమవారం తెలిపారు. ఈనెల 8, 10, 12, 15, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని వారు తెలిపారు.

రేపు స్పోర్ట్స్‌బోర్డు సర్వసభ్య సమావేశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్‌బోర్డు సర్వసభ్య సమావేశం ఈనెల 3వ తేదీన(రేపు)ఉదయం 11గంటలకు యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య సోమవారం తెలిపారు. ఇందులో కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ కళాశాలల వ్యాయామ విభాగపు ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొంటారని తెలిపారు. 2025–2026 విద్యాసంవత్సరానికి సంబంధించి క్రీడలు, అథ్లెటిక్స్ నిర్వహణకు సంబంధించిన క్యాలెండర్‌ను రూపొందించి చర్చిస్తారని తెలిపారు. వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం,యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి. మనోహర్ , కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ హబీబుద్దీన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారని వెంకయ్య తెలిపారు.

వాజేడు: హోరున జాలువారుతున్న బొగత జలపాతం వద్ద పర్యాటకులు



గూడూరు: ఉధృతంగా జాలువారుతున్న భీమునిపాదం జలపాతం



బయ్యారం: పాండవుల జలపాతం..



వావ్.. వాటర్ ఫాల్స్

పాలనురగలా జాలువారుతున్న జలపాతాలు

- పర్యాటకుల మనసు దోచుకుంటున్న బొగత, భీమునిపాదం, పాండవుల జలపాతాలు

చుట్టూ పచ్చని అటవీ ప్రాంతం.. అడవి మధ్యలో ఎత్తైన గుట్టలు.. ఆ గుట్టల మధ్య ఏర్పడిన సహజసిద్ధ పాయల నుంచి పారుతున్న నీరు పాలనురగలా జాలువారుతోంది. అలుగుపై గలగలా పారుతూ పర్యాటకుల మనసును కట్టిపడేస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామ సమీపంలోని బొగత, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపంలోని భీమునిపాదం, ఇదే జిల్లా బయ్యారం సమీపంలోని పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం ఉధృతంగా జాలువారుతున్నాయి. దీంతో ఆ అందాలను చూసేందుకు సోమవారం పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు ఆయా జలపాతాల వద్దకు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా జలపాతాల్లో స్నానం చేస్తూ కేరింతలు కొట్టారు. సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఎంజాయ్ చేశారు. జలపాతాల అందాలకు ఫిదా అయ్యారు. - వాజేడు/గూడూరు/బయ్యారం

పందిరి సాగు.. బహుబాగు..

ఈ విధానపు కూరగాయల తోటలతో అధిక దిగుబడి, ఆదాయం

- పందిరి ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ
- ఎకరాకు రూ. లక్ష రాయితీ
- గరిష్టంగా రెండున్నర ఎకరాల వరకు అవకాశం



హన్మకొండ: పందిరి కూరగాయల తోటల ద్వారా అధిక దిగుబడితోపాటు అధిక ఆదాయం అర్జించొచ్చు. ఏడాది పొడవునా దిగుబడులు పొందొచ్చు. అందుకే పందిరి కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఉద్యాన శాఖ ద్వారా రాయితీ అందిస్తోంది. శాశ్వత పందిరి ఏర్పాటు కోసం 50 శాతం రాయితీ చొప్పున ఎకరాకు రూ. లక్ష అందిస్తుంది. ఒక రైతుకు గరిష్టంగా రెండున్నర ఎకరాల వరకు సబ్సిడీ ఇస్తారు. శాశ్వత పందిరిపై అనప, గుమ్మడి, పొట్ల, కాకర, బీర, దోస, బూడిద గుమ్మడి వంటి తీగజాతి కూరగాయలు పండించొచ్చు. ఈ పద్ధతి కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. ఏడాదికి మూడు పంటలు వేసుకోవచ్చని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.

నేలలు: ఈ పంటలను అన్ని రకాల నేలల్లోనూ సాగు చేసుకోవచ్చు. ఇసుక నేలల నుంచి తేలికపాటి బంకమన్ను వరకు అన్ని నేలల్లో పండించొచ్చు. ఎక్కువ క్షార, ఆమ్ల గుణలున్న నేలల్లో ఎదుగుదల సరిగా ఉండదు. ఈ నేలల్లో సాగుచేస్తే ఆకులు పసుపు వర్ణానికి మారుతాయి. ఉదజని సూచిక 6.0 నుంచి 6.7 ఉన్న నేలలు సాగుకు అనుకూలం. మురుగునీటి వసతి ఉండడం తప్పనిసరి. పొలాన్ని 3–4 సార్లు బాగా దున్ని తయారుచేసుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 20 టన్నుల వరకు బాగా మాగిన పశువుల ఎరువును వేయాలి.

విత్తనం విత్తే పద్ధతి: భూమి మీద పాకించే పాదులకు, వర్షాకాలంలో నీటి కాల్వలకు తోడుగా మురుగు నీరు వెళ్లడానికి 2 మీ. దూరంలో కాల్వలు చేయాలి. వేసవిలో వేసే పాదులకు పొలం అంతటా నీటి పారుదల కోసం బోదెలను చేయాలి. అన్ని రకాల పాదులకు 3 విత్తనాలను 1–2 సెం.మీ. లోతులో విత్తుకోవాలి.అన్ని తీగజాతి కూరగాయలను వర్షాధార పంటకు 10 సెం.మీ. కొలతలు గల పాలిథీన్ సంచుల్లో విత్తుకుని 15–20 రోజులు పెరిగిన తర్వాత అదునులో పొలంలో నాటుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రా. చొప్పున థైరమ్, 5 గ్రా. చొప్పున ఇమిడాక్లోప్రిడ్ ఒకదాని తర్వాత మరొటి కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఆ తర్వాత 100 గ్రా. విత్తనానికి 2గ్రా. చొప్పున ట్రైకోడెర్మా విరిడేతో విత్తన శుద్ధి చేసి విత్తాలి. విత్తే ముందు ఎకరాకు 8–10 టన్నుల పశుఎరువు, 32–40 కిలోల భాస్వరం, 16–20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను గుంటల్లో వేయాలి. నత్రజనిని (32–40కిలోలు) రెండు సమపాళ్లుగా చేసి విత్తిన 25–30 రోజులకు, పూత, పిందె దశలో వేసుకోవాలి. మొక్కకు దగ్గరలో ఎరువు వేయొద్దు. ఎరువు వేసిన వెంటనే మట్టిని కప్పి నీరు పారించాలి.

కలుపు నివారణ, అంతరకృషి: కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. 2–3 తడుల తర్వాత మట్టిని గుల్లచేయాలి. ఎకరాకు పెండిమిథాలిన్ 1.2 లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 24–48 గంటల లోపు నేలకు పిచికారీ చేయాలి. మొక్కలు 2–4 ఆకుల దశలో ఉన్నప్పుడు లీటర్ నీటికి 3 గ్రా. బోరాక్స్ కలిపి ఆకులపై పిచికారీ చేస్తే పూలు ఎక్కువ పూసి పంట దిగుబడి అధికంగా ఉంటుంది. కాకర, పొట్ల పంటలను తప్పనిసరిగా పందిరి పైకి తీగలు పాకించాలి. లేని పక్షంలో పండు ఈగ బెడద ఎక్కువ ఉంటుంది. అనప, బీర, పొట్ల, కాకర పంటలను పందిళ్లపై పెంచితే నాణ్యత గల కాయలు కాసి అధిక ధర లభిస్తుంది.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి..



పందిరి కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా అందజేస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పందిరి కూరగాయల సాగు లాభదాయం. అధిక దిగుబడి వస్తుంది. దీంతో ఆదాయం పెరుగుతుంది. **– జి.అనసూయ, ఆర్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, హనుమకొండ, వరంగల్**

కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో ఎన్ఐ వర్క్స్..

- 3వ తేదీన పలు రైళ్లు రద్దు, కొన్ని పాక్షికంగా రద్దు
- పలు ట్రైన్లకు హాల్టింగ్‌లు ఎత్తివేత, రెగ్యులేషన్..



కాజీపేట రూరల్ : కాజీపేట–బల్లార్షా రైల్వే సెక్షన్ల మధ్య ఎన్ఐ పనుల(కమిషనింగ్ ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్)తో కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే పలు ప్యాసింజర్ రైళ్ల రద్దుతో పాటు మరికొన్ని పాక్షికంగా రద్దు, కొన్ని రైళ్లకు హాల్టింగ్‌లు ఎత్తివేత, మరికొన్ని రైళ్లను రెగ్యులేషన్ చేసి నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

ఈ నెల 3వ తేదీన కాజీపేట–సిర్పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17004) ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17036) ప్యాసింజర్, ఈ నెల 2వ తేదీన(నేడు) కాజీపేట–బల్లార్షా (17035) ప్యాసింజర్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు..

ఈనెల 3వ తేదీన భద్రాచలంరోడ్–బల్లార్షా (17033) సింగరేణి కాజీపేట–బల్లార్షా మధ్య, సిర్పూర్‌టౌన్–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఇంటర్‌సిటీ ఈ నెల 2న సిర్పూర్ కాగజ్‌నగర్–కాజీపేట మధ్య, సికింద్రాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) ఇంటర్‌సిటీ కాజీపేట–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఉప్పల్, జమ్మికుంటలో పలు రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేత

ఈ నెల 3న హైదరాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) ఇంటర్‌సిటీ, సిర్పూర్‌కాగజ్‌నగర్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757) ఎక్స్‌ప్రెస్‌లకు జమ్మికుంట, ఉప్పల్ రైల్వే స్టేషన్లలో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేసినట్లు సీపీఆర్వో తెలిపారు.

రెగ్యులేషన్ ట్రైన్స్..

ఈ నెల 3న కాజీపేట, వరంగల్ మీదుగా వెళ్లే శ్రీమాతవైష్ణవి దేవికాట్రా–కన్యాకుమారి (16318) ఎక్స్‌ప్రెస్ 90 నిమిషాలు, లక్నో–చెన్నై సెంట్రల్ (16094) ఎక్స్‌ప్రెస్ 75 నిమిషాలు, గోరఖ్‌పూర్–యశ్వంత్‌పూర్ (15023) ఎక్స్‌ప్రెస్ 45 నిమిషాలు, సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (12758) ఎక్స్‌ప్రెస్ 30 నిమిషాలు, న్యూఢిల్లీ–విశాఖపట్నం (20806) ఎక్స్‌ప్రెస్ 20 నిమిషాల పాటు రెగ్యులేషన్ చేసి నడిపించనున్నట్లు సీపీఆర్వో తెలిపారు.

రాష్ట్ర విద్యాపాలసీ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్యాపాలసీ కమిటీ మెంబర్‌గా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియమితులైనట్లు ప్రభుత్వ కార్యదర్శి యోగితా రాణా ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఉండగా మరికొంత మంది ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వృత్తి, నైపుణ్యం, వృత్తి విద్యలో సంస్కరణలు సూచించడం, సమానత్వం, క్వాలిటీ ఎడ్యుకేషన్ నిర్ధారించడం వంటి అంశాలపై సభ్యులు సూచనలు చేయనున్నారు.

యూరియా పంపిణీలో నకిలీ కూపన్ల కలకలం..



నర్సింహులపేట: యూరియా నకిలీ కూపన్లు కలకలం సృష్టించాయి. సోమవారం సాయంత్రం మండల కేంద్రానికి చెందిన లక్ష్మీసాయి ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులకు 220 బస్తాలు రావడంతో కూపన్లు తీసుకున్న రైతులు షాపు వద్ద లైన్‌లో నిలుచున్నారు. కొందరు రైతులు తీసుకున్న తర్వాత 42,45 మరో నంబర్‌తో కలర్ జిరాక్స్‌తో (నకిలీ కూపన్) లారీ వద్దకు రావడంతో నిర్వాహకులు ఇంతకు ముందే ఈ నంబర్‌పై పంపిణీ చేశామని వచ్చిన వారిని పట్టుకున్నారు. యూరియా పంపిణీ త్వరగా జరగడం, రైతులు పెద్ద ఎత్తున రావడంతో రెండు నకిలీ కూపన్లతో రెండో సారి వచ్చినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై సురేశ్ షాపు వద్దకు వచ్చి నకిలీ కూపన్ల నంబర్లను ఆరాతీసి నిందితులను పట్టుకుని వారి నుంచి రికవరీ చేశారు.

సమీక్షకు అసోసియేషన్లను ఎందుకు పిలువలేదు?

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

హన్మకొండ: సమీక్ష సమావేశానికి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులను ఎందుకు పిలువలేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. సోమవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశం నిర్వహించింది. దీనికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులను పిలువకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషన్ చైర్మన్.. వెంటనే సంఘాల నాయకులను పిలువాలని ఆదేశించారు. దీంతో వెంటనే అసోసియేషన్ నాయకులకు సమాచారం అందించారు. అదే విధంగా జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి వచ్చారా అని ఆరా తీశారు. రాలేదని అధికారులు చెప్పడంతో న్యూస్ ఎవరు చేస్తారు.. వెంటనే పిలిపించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తనకు వచ్చిన వినతి పత్రాలను పరిశీలించి వాటిని పంపిస్తానని, వాటిని పరిష్కరించి తనకు నెల రోజుల్లో ఆ నివేదికను పంపాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు ఎన్పీడీసీఎల్‌లో పరిష్కారం కావడం లేదన్నారు. ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి శ్రీరాం నాయక్ మాట్లాడుతూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ఆదేశాలను కంపెనీ పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుర్సం నీలాదేవి, రాంబాబు నాయక్, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, సీఈలు కె.మాధవ రావు, రాజు చౌహాన్, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్‌డీ డైరెక్టర్ సి.ప్రభాకర్ కంపెనీలో చేపట్టిన నియామకాలు, పదోన్నతుల్లో అమలు చేసిన రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్‌ను సమీక్షలో వివరించారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్, బ్యాక్‌లాగ్ వెకెన్సీస్, రోస్టర్ అమలుపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్ష నిర్వహించింది. అధికారులు డీసీసీబీలో చేపట్టిన నియామకాలు, పదోన్నతుల్లో అమలవుతున్న రిజర్వేషన్ రోస్టర్ వివరాలు వివరించగా టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు బ్యాంకు ప్రగతి, ఉద్యోగుల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. హనుమకొండ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జన్ను మహేందర్, డీసీసీబీ జీఎంలు ఉషా శ్రీ, పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు రాజు, మధు, స్రవంతి, కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

- మావద్ద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, LLB, B.Tech, ITI, డిప్లొమా, ఫార్మసీ, BAMS, MBBS, BPT, D.MLT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సంప్ర 99481 31154 [SCA 25007755]

REAL ESTATE

LEASE FOR SALE

- హోటల్ (లీజ్/సేల్) హన్మకొండ మెయిన్ సెంటర్లో మంచి రన్నింగ్ కండీషన్‌లో ఉన్న హోటల్ లీజ్ కి లేదా సేల్ చేయబడును. సెల్: 7569268606. [SCA25007758]

PLOT FOR SALE

- హన్మకొండ కిట్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రక్కన, బస్వారెడ్డి టౌన్‌షిప్ 1st లైన్‌లో 530 Sq.Yds ఓపెన్ ప్లాట్ అమ్మబడును. సంప్ర. 99634 15800. [SCA25007717]

SERVICES

- బాలాజీ (WGL) : హౌస్, ప్లాట్లు, రేకుల ఇంటిపైన, ఇందిరమ్మ ఇంటిపైన, పింఛన్ లోన్స్ ఇవ్వబడును. మార్టిగేజ్ లోన్స్, ఇళ్లపైన లోన్స్ కలవు. సంప్ర.- 85228 25358. [SCA25007788]

BEAUTY CARE

- మచ్చలు లేని అందమైన చర్మం మీ కోసం, పిగ్మెంటేషన్‌కి గుడ్ బై.గ్లో కి హాలో నల్ల మచ్చలు తగ్గించండి. సహజ కాంతిని పొందండి. ప్రతిరోజు మృదువైన అందమైన చర్మం. సెల్:7093076897. [SCA25007767]

WANTED

- Wanted డ్రైవర్స్: భవాని ఖార గొరైకుంటలో పని చేయుటకు DCM డ్రైవర్స్ కావలెను. ఫోన్ కాల్ టైమ్స్ 11AM - 6PM. Cell: 9396991649 [SCA25007683]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ. 260/- అదనపు లైను రూ. 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : భార్య మందలించిందనే కారణంతో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం కొమ్ముగూడెంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య గణేశ్ (35), జ్యోత్స్న దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. గణేశ్ కొంతకాలం నుంచి మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. దీంతో భార్య గత నెల 31వ తేదీన మందలించింది. దీనిపై మనస్తాపం చెందిన గణేశ్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై దీపిక తెలిపారు.

ఒంటరి జీవితం గడపలేక గండితండాలో యువకుడు..

గార్ల: భార్య కాపురానికి రావడం లేదనే కారణంతో ఒంటరి జీవితం గడపలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రియాజ్‌పాషా కథనం ప్రకారం.. గార్ల జీపీ పరిధి గండితండాకు చెందిన బానోత్ సుమన్(32)కు అదే తండాకు ప్రమీళతో పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఈ క్రమంలో సుమన్ మూడేళ్ల నుంచి మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతుండడంతో భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెందిన సుమన్ ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి ద్వాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రియాజ్‌పాషా సోమవారం పేర్కొన్నారు.

ఇంటి పనుల విషయంలో గొడవతో మరో యువకుడు..



సతీశ్(ఫైల్)

సంగెం: ఇంటి పనుల విషయంలో జరిగిన గొడవతో మనస్తాపం చెందిన ఓ యువకుడు క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన ముడిదేని సతీశ్ (31)కు పదేళ్ల క్రితం ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన తిప్పని అనూషతో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఇంటి పనుల విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సతీశ్ క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే 108లో ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మహిళా దొంగ అరెస్ట్



నిందితురాలి అరెస్ట్ చూపుతున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

వరంగల్ క్రైం: రద్దీ సమయంలో బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికురాలి బ్యాగు నుంచి డబ్బులు అపహరించిన మహిళా దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. ములుగు జిల్లా గొల్లవాడ గ్రామానికి చెందిన ప్రమీళ సోమవారం హైదరాబాద్ వెళ్లడానికి హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతోంది. ఈ క్రమంలో ఆమె బ్యాగు నుంచి ఓ మహిళా దొంగ రూ.75 వేలు అపహరించింది. దీంతో ప్రమీళ కేకలు వేయగా అక్కడే విధుల్లో ఉన్న హనుమకొండ ఎస్సై కిశోర్ అప్రమత్తమై బస్టాండ్‌లో తనిఖీ చేశారు. ఈ సమయంలో ఓ మహిళ.. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. ఆమె బ్యాగు తనిఖీ చేయగా అందులో అపహరించిన రూ. 75 వేలు లభించాయి. సదరు మహిళా దొంగను మహారాష్ట్రలో నాగ్‌పూర్‌కు చెందిన సరిఫ బాయి సురేశ్ మంకార్‌గా గుర్తించారు. అనంతరం ప్రమీళ ఫిర్యాదు మేరకు ఎస్సై కిశోర్ కేసు నమోదు చేసి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

సైబర్ మోసం..

- బ్యాంకు ఖాతా నుంచి రూ. 38,500 మాయం



గీసుకొండ: మండలంలోని కొనాయమాకులకు చెందిన కక్కెర్ల నిహారిక బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 38,500 మాయం చేశారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ కథనం ప్రకారం..నిహారిక ఇటీవల హనుమకొండ జిల్లా కాజీపేట వద్ద తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. ఈ విషయమై కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి పది రోజుల్లో సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి ఆమెకు అప్పగించారు. ఈ మధ్యలో నిహారిక ఎస్‌బీఐ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు ఎనిమిది విడతలుగా రూ. 38,500ను డ్రా చేశారు. దీనిపై నిహారిక గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

కిరాణాషాపులో చోరీ..

- రూ.లక్ష విలువైన సామగ్రి అపహరణ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి శివునిపల్లిలో మసీదు సమీపంలోని సత్యనారాయణస్వామి కిరాణా షాపులో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో రూ.లక్ష విలువైన సామగ్రి అపహరణకు గురైంది. దుకాణ యజమాని పార్శి రాము, పోలీసుల కథనం ప్రకారం.. రోజూమాదిరిగానే రాము ఆదివారం రాత్రి దుకాణం బంద్ చేశారు. సోమవారం ఉదయం షాపు తెరిచేసరికి దుకాణం వెనుక ఉన్న తలుపులు తెరిచి ఉన్నాయి. ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా సామగ్రి కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరు పరిశీలించారు. ఈ ఘటనలో సుమారు రూ. లక్ష విలువైన సామగ్రి అపహరణకు గురైందని బాధితుడు రాము కన్నీరుమున్నీరయ్యాడు. కాగా, రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.